# బతుకు సేద్యం

దొడ్లో నిల్చుని వేపపుల్లతో  పళ్ళు తోముకొంటొంటే "అయ్యా" అంటూ వచ్చాడు సీతారామయ్య కొడుకు క్రిష్ట.

"ఇంగా మొగం కడగలేదా? తిన్నె సద్దికూడు గూడా సగం అరిగి పొయ్యిందే మాకు!" అన్నాడు నవ్వుతూ.

"పన్జేస్తే గదంటరా ఆకలయ్యేది", అంటూ ఇందిర కేసి తిరిగి 'కాఫీ ఇవ్వమన్నట్లుగా సైగ చేశాను.

ఇందిర గ్లాసందివ్వబోతే, వాడు తీసికోలేదు. "సల్లగా మజ్జిగ తాగొచ్చినా, యీ ఉడుకు నీళ్లెందుకు తల్లో! నాకొద్దులే" అన్నాడు.

"ఉడుకయితే నేం? చలువయితేనేం? ఆ గ్లాసెడు నీకేమూలకు! తాగరా!" చెప్పాను.

బలవంతంగా అందుకొన్నాడు వాడు.

నేను మొహం కడుక్కొని, తుండుగుడ్డతో తేమ తుడుచుకొంటూ వాడికేసి తిరిగి, "ఏమిటి విశేషం?" అడిగాను.

"మీ వంకవార సేను ఎవురికెన్నా కోరుకు జెప్పినావా అయ్యా?"

"ఎవరికీ చెప్పలే"

"యీ యేడు నేను కోరుజేసుకొంటా. నాకియ్యరాదూ!"

"నీతో అవుద్దంటవా?" ప్రశ్నించాను.

'యి య్యేడు సూడు. నచ్చుతే వచ్చేటేడు గూడా నాకే యియ్యి. నచ్చకుంటే తరిమేయ్" అన్నాడు నవ్వుతూ

"సరే... చూద్దాంలే" చెప్పాను.

కొద్దిసేపు మాట్లాడింతర్వాత కృష్ణ వెళ్ళిపోయాడు.

వాణ్ణి చూస్తొంటే ముచ్చటేస్తుంది నాకు.

వాడి చదువు, పని, రైతుగా రూపెత్తటం అంచెలంచెలుగా నా కళ్లముందే జరిగింది.

ఈ మార్పులన్నీ ఐదేళ్ళ యివతలే జరిగాయి.

వ్యవసాయం చేయలేక కాడి ఎత్తి పెట్టాలనుకున్న వాళ్ళ నాన్న చేతిని వాడు మేడి అందుకొన్న విధం ఆసక్తికరంగా వుంటుంది.

ఐదేళ్ళ క్రితం వాడు తన చేతిలోని పగ్గాల్ని అందుకొని మేడితోకను ఎడమ చేత అదిమి పట్టి జమాయించి దున్నుతున్నపుడు గెట్టుమీద నిల్చుని ఏదో వింతను చూస్తున్నట్లుగా గుడ్లప్పగించే వాడు సీతారామయ్య. అలసట లేకుండా సేద్యం చేస్తోన్న వాడి కేసి చూసి సంచి భుజానేసికొని ఇంటిదారి పట్టేవాడు.

పుస్తకాల సంచిమీద కన్నా ఎద్దుల్ని అజమాయిషీ చేసే పగ్గాల మీదా, ముల్లుగుర్రమీద వాడికి ప్రేమ ఎక్కువగా వున్నందుకు ఆయనకు ఎటూ పాలు పోలేదు. అప్పటికే వాణ్ణి చాలా స్కూల్లు మార్పించాడు.

నర్సాపురం, పోరుమామిళ్ళ, కల్సపాడు, చెన్నారెడ్డి పల్లె వగైరా స్కూళ్ళన్నీ తిరిగాడు.

వాడెక్కడా ఇమడలేదు.

వాణ్ణి అరిగించుకొనేందుకు ఏ స్కూల్‌కు శక్తి చాల్లేదు. చివరకు వాణ్ణి కోడిగుడ్లపాడు హైస్కూల్లో చేర్పించాడు సీతారామయ్య.

కొంత ముడుపు చెల్లించి హాస్టల్‌లో వదిలాడు.

వాడి బాధ తప్పిందనే అనుకొన్నాడు.

పదిరోజులు తిరక్కముందు పెట్టె, చాప సర్దుకొని ఇంటికొచ్చిన కొడుకును చూసి దిగులుపడుతూ, నావద్ద కొచ్చి తలపట్టుకూచున్నాడు ఆయన.

"ఎట్టజెయ్యాలబ్బీ యీన్ని? పనిబాటకు పంపిజ్జామంటే - యీ కస్టం జెయ్యలేడు. బడికి బొమ్మంటే - యీడా నాౖలోజులుండడు. నువ్వన్నా జెప్పు నాయినా!" అంటూ వాపోయాడు.

క్రిష్ణను పిలిపించాను అప్పుడే. హాస్టల్ విడిచొచ్చినందుకు కారణం అడిగాను.

"అబ్బే ఆడేడుంటవులే అయ్యా! బువ్వనిండా పురుగులే!" అన్నాడు.

వింటోన్న సీతారామయ్యలో వెంటనే మార్పొచ్చింది.

ఈ పదిరోజులూ కొడుక్కి పురుగుల కూడు తినిపించినందుకు బాధపడుతున్నట్లుగా కన్పించింది.

"అంత లెక్కదీసుకొంటా - పురుగుల కూడు బెట్టిండా?" అంటూ హాస్టల్ వార్డెన్‌ను తిట్టాడు కొంతసేపు.

తర్వాత ఏదో ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా లేచాడు.

"వెయ్యి రూపాయలు లెక్కుంటే యీబ్బీ! వొడ్డీ యేసిస్సా" అన్నాడు.

నా వద్ద అంతంత మాత్రమే వుంది.

"జీతం రాగానే ఇస్తా!" చెప్పాను.

"ఎన్రోజులు పడ్తది?"

"పదిరోజులు దాటాల?"

"అన్ని రోజులా?" గొణుక్కొన్నాడు.

"ఇంతకీ దేనికీ?" అడిగాను.

"పిల్లోనికి సైకిల్ కొనియ్యాల. నడ్సి బడికెట్లా పోతాడు?" అన్నాడు.

తర్వాత ఊరి మీద బడ్డాడు.

రాత్రి చాలా సేపు తిరిగినా డబ్బు దొరకలేదని తెలిసింది.

రెండోరోజు సాయంత్రానికి వీధుల్లో సైకిల్ మీద జమాయించి తిరుగుతున్నాడు క్రిష్ణ.

"లెక్కెడ దొరికింది?" సీతారామయ్యను అడిగాను.

"మా యింటిదాని కమ్మలమ్మినా!" చెప్పాడు.

గుండె జల్లుమంది నాకు.

ఎంత ప్రేమ వాడి చదువు మీద!

ఎంత ఆశ వాడి భవిష్యత్తు పైన!

వాడు బాగా చదువుకొని, గవర్నమెంటు ఉద్యోగం చేస్తూ కాలిమీద కాలేసుకొని నెలపంట అందుకొంటూ సుకంగా బతుకుతావుంటే సూడాలనే బలమైన కాంక్ష ఆయన కళ్ళల్లో క్షణక్షణం తాండవిస్తుండేది.

నేను కూడా వాడి చదువు స్థితిని విచారించాలనుకొన్నాను.

ఒకనాటి ఉదయం పూట బడి వదలగానే క్యారియర్‌తో సహా కోడిగుడ్ల పాడు ప్రయాణమయ్యాను.

నా క్లాస్‌మేట్ శివరాముడు అక్కడ సైన్స్ టీచర్‌గా పన్జేస్తున్నాడు.

అతన్ని కలిశాను.

కలిసి భోం చేశాము.

భోజన సమయంలో క్రిష్ణ విషయం ప్రస్తావించాను.

"వాడా!..." తేలిగ్గా అన్నాడు శివరాం. "వాడసలు బడికొస్తాంటే గదా! మేం స్పెషల్‌గా ట్రీట్ జేసేది" చెప్పాడు.

ఆశ్చర్యపోయాను.

"అస్సలు రావటం లేదా?" నొక్కి ప్రశ్నించాను.

"వస్తాడన్నా! - వారానికోసారి. అడిగితే ఏంటంటో కారణాలు చెబుతాడు. పైరు పచ్చులంటాడు. గింజల కల్లాలంటాడు. సెనక్కాయ పీకుళ్ళంటాడు. మేమే అడక్కుండా చాలించుకొన్నాం." చెప్పాడు.

నేను విషయమంతా వివరించాను.

"నన్నేం జెయ్యమంటావన్నా! వాడికి బడి మీద ధ్యాసేలేదు" అన్నాడు.

టైమవుతుందని కొండ్రాజుపల్లె ప్రయాణమయ్యాను.

చేలన్నీ వేరుశెనగ పీకి కుప్పలు పెట్టివున్నారు. కూలీలు కుప్పల చుట్టూ కూచుని కాయలు కోస్తున్నారు.

నా ఆలోచనలన్నీ వాడిపైనే వున్నాయి. అన్నం క్యారియర్ తీసికొని ప్రతి రోజూ బడికొస్తున్నాడు. బళ్ళోకి మాత్రం వెళ్ళటం లేదుట. మరెక్కడికి వెల్తున్నట్లు?

ఇంటి వద్ద చెబితే మరీ బాధపడ్తారు అందుకే చెప్పదల్చుకోలేదు. నేనే పిల్చి మందలిద్దామనుకొన్నాను.

వాణ్ణడిగితే నిజం చెబుతాడని నాకు నమ్మకం లేదు. వాడి పోకడ రహస్యమేదో తెలిసికొన్న తర్వాత నిలదీయాలనుకొన్నాను.

మర్నాడు రోజు స్కూల్ వదలగానే కోడిగుడ్లపాడు వెళ్లాను.

శివరామున్ని అడిగితే - వాడు రాలేదన్నాడు.

లాంగ్‌బెల్ కొట్టేంత దాకా అక్కడే వుండి దారికట్టాను.

ఊరు దాటాను.

తుమ్మచెట్ల మధ్య యిరికిరికి పడుకొన్న బండ్ల బాటమీద మెల్లిగా సైకిల్ తొక్కుతున్నాడు.

ఎదురుగా పది గజాల దూరంలో రోడ్డుపక్కనే శిథిల సత్రం. దాని పక్కన్నే చేలల్లోకి వెళ్లే కాలిబాట.

నేనింకా సత్రం వద్దకు చేరుకోలేదు.

అప్పుడే - కాలిదారెంట వేగంగా వచ్చి రోడ్లో కలిసి ముందుకు దూసుకెళ్లింది ఓ సైకిల్. దాని మీదున్న రౌతు అటు ఇటు కూడా చూడలేదు. హుషారుగా పెడల్స్ వేస్తున్నాడు.

తృటిలో పోల్చుకొన్నాను.

వాడే... క్రిష్ణ...

అడ్డదారి వద్ద కింద కాలూని, సైకిల్ నిలిపి ఎదుట చేలల్లోకి చూశాను.

కనుచూపు మేర వేరుశెనగ చేలే. కంది పట్టెలతో కూడిన చేలు... చేలల్లో కుప్పలేసిన వేరుశెనగ కట్టెకుప్పల చుట్టూ కూలీలు.

వాడెక్కణ్ణించి వచ్చినట్టు?

బడి ఎగ్గొట్టి యీ చేలల్లో ఏం చేస్తున్నట్లు?

సరిగ్గా బడి వదిలే సమయానికే వచ్చి దారిలో కలిసి పోవటంలో వాడి అంతర్య మేమిటి?

ఈ ప్రశ్న సమాధానాల కోసం మర్నాడు రోజు బడివదిలి నేరుగా సత్రం వద్దకే వచ్చాను. సైకిల్‌ను చెట్ల చాటున స్టాండేసి, లాక్‌జేసి, కాలి దారెంట ముందుకు నడిచాను.

రెండు చేల మేర వెళ్లింతర్వాత కందిచేను ఎదురొచ్చింది. లోపల అలసంద చెట్లు, పెసరచెట్లు, సంటి బిడ్డల్లా దోర్లే కాయలతో దోసతీగలూ అల్లిబిల్లిగా అల్లుకొని వున్నాయి.

కందిచేను దాటి మలుపు తిరగబోతోన్నంతలో ఎదురుగా వేరుశెనక్కట్టె కుప్ప. దాని పక్కగా స్టాండేసిన సైకిల్.

ఉలిక్కి పడి ఒకడుగు వెనక్కి వేశాను. లేచి నిల్చుని నిక్కరు దులుపు కొంటున్నాడువాడు. పక్కనున్న వాళ్ళతో ఏదో మాట్లాడి సైకిల్ వద్దకు వచ్చాడు.

కందిచేలోకి నాలుగు బార్ల వెనక్కి వెళ్లి ఓ దోసకాయ పెరుక్కుని తింటూ కూచున్నాను నేను. పెరిగిన కంది మొదళ్ళ చాటున్నించి బైటి దృశ్యం అందంగా కన్పిస్తోంది. పంచలో నిల్చుని వర్షపు ధారల వెనక వీధిని చూస్తున్నట్లుగా వుంది.

అప్పుడే వాడి సైకిల్ కంది చేను వారగా కాలిదారెంట వేగంగా వెళ్లింది.

నేను బైటకొచ్చాను.

వేరు శెనక్కట్టె కుప్ప వద్దకు నడిచాను.

ఎవరన్నట్లుగా కనుబొమలు ముడేసి నాకేసి చూశారు వాళ్లు.

"కూకుందూరాన్నా! సెనక్కాయల్దిందూరా!" అంటూ ఆహ్వానించినారు.

ఊరు పేరడిగి తెల్చుకొని సంతోషించారు.

శెనక్కాయలు తినమని బలవంత పెట్టారు.

కాయలొల్చి పప్పులు నోటబెట్టుకొంటూ అసలు విషయం కదిపాను నేను.

"ఆ పిల్లోడా! బో వుషారు పిల్లోడులేన్నా! మా పక్క కూలోల్లెవురూ ఆ పిల్లోనెంత బిసగా కాయలు పీకలేరు. ఎట్టలేదన్నా మాపిటేలకు ముప్పయి రూపాయలు సంపా యిచ్చుకొని పోతాడు.

'సదూకోను పోరా! నువ్వు రావొద్దురా నాయినా!' అంటే మొండి కొస్పడు. వాడు పిల్లోడు గాదన్నా!' పిడుగు" చెప్పారు.

ప్రైవేటు క్లాసులున్నాయని ఆదివారాలు కూడా వస్తున్నాడు. ఈ వయస్సులో చదువుకు బదులు సంపాదన పైన ఆసక్తి ఏర్పడిందంటే వింతగా వుంది.

ఇంతకీ... యీ కూలిడబ్బుంతా ఏంజేస్తున్నట్లు?

ఎక్కడ దాస్తున్నట్లు?

నాకు బాధేసింది - వాడి పోకడ పట్ల.

వాళ్లతో కొద్దిసేపు మాట్లాడి వెనక్కి తిరిగాను.

రాత్రి వాణ్ణి దగ్గరకు పిల్చుకొని చదువు యొక్క ఆవశ్యకత గురించీ, వాడి కర్తవ్యాన్ని గురించీ చాలా సేపు బోధించాను.

సమాధానం చెప్పకుండా గోళ్లు గిల్లుకొంటూ మౌనంగా కూచుని వున్నాడు.

వాడి ఫీలింగ్స్ బట్టి నా కర్థమైంది - శెనక్కాయ సీజన్ అయిపొయ్యే దాకా కూలికి చాలించడని.

ఇంట్లో చెప్పడం వల్ల ఉపయోగం వుండదు - వాళ్లు మానసిక క్షోభ అనుభవించటం తప్ప.

శెనక్కాయల సీజన్ ఐపోయింది.

కొన్ని రోజులు ప్రశాంతంగా గడిచాయి.

అప్పుడప్పుడూ సీతారామయ్య వాణ్ని గురించి నా వద్ద ఆరాతీస్తున్నాడు.

శివరామున్ని అడిగితే "మునుపటి కంటే మెరు"గన్నాడు. మార్నింగ్ స్కూల్ మొదలయ్యింది.

ఎండల్లో మాడిపోతూ మధ్యాహ్నం ఇంటికి రావాలంటే అసాధ్యంగా వుంది.

బావుల కింద రెండవ కారు పైరు కూడా పండొచ్చింది.

ఒకనాడు సీతారామయ్య నావద్దకొచ్చాడు. "ఎట్లజెయ్యాల ఎంకట్రామయ్యా" అంటూ..

"ఏమన్నా?" అడిగాను.

"ఏముంది? కిట్టిగాని కతే" అన్నాడు "వానికి బడిమీద కన్నా పనిమిందే యావజాస్తయింది. పనిగుండా యిదల గొడ్తాండు. నిన్న నాకు వొల్లు బాగాలేక యింటి కాడ పడుంటే - కూలోన్ని పెట్టుకొని పొద్దు గూకులా శెనక్కాయ కట్టె బండికేసి యింటికి దోలిండు. జమాయించి పన్జేసిండు. "బడికి పోరా... పని రేపయి"ద్దంటే "ఒక్కరోజు పోకుంటే ఇబ్బంది లేదులే" అన్నాడు. "నాది ముండ్ల దోవరా! యీ దోవన పోవొద్దు. మంచి దారి బట్టరా!" అంటే "నాకు ముండ్ల దోవే కావా"లంటాండు. నువ్వయినా మందలియ్యి నాయినా!" అన్నాడు ఆవేదనగా.

'సరే' నన్నాను.

ఆయన ఆవేదన నాకు తెలుసు.

తెలీందల్లా 'వాడినెట్లా దారికి తేవాలా?' అనే. తర్వాత వారం రోజులకు బడికెళ్లాలని సైకిల్ ముట్టకొంటే గాలి తగ్గి వుంది. గాలి కొడితే నిలవలేదు. పంచరయి నట్లుంది.

వాడి సైకిల్ మీదే ఇద్దరం వెళ్లాము.

బడి వదలింతర్వాత అదే సైకిల్ మీద ఇంటి కొస్తున్నాము. బసనపల్లె దాటి, గాడివాగు దాటి బొల్లయ్యకుంట వద్ద కొచ్చింది సైకిల్.

ఎదురుగా ఫర్లాంగు దూరంలో ఉప్పువాగు కన్పిస్తోంది.

"అయ్యా! అయ్యా! అన్నాడు వెనక క్యారియర్ మీంచి వాడు. "ఏం రా?"

"ఆ పక్క జూడయ్యా! అబ్బబ్బబ్బా... ఏముందయ్..."

వాడి ఆశ్చర్యం నా చేత సైకిల్‌కు బ్రేకేయించింది.

ఓ వైపు కాలూని వెనక్కి తిరిగి చూసే లోపల వాడు సైకిల్ దిగాడు.

"ఏందిరా నీ గొడవ?" అడిగాను.

"అట్లా చూడయ్యా!.. చూడు..." చేయెత్తి చూపించాడు.

అటుకేసి చూశాను.

కంపచెట్లతో నిండిన గరుగులు... గులకరాళ్ల మిట్టలు.. అక్కడొకటి యిక్కడొకటి తెల్లటి పలుగురాళ్ళు.

"ఏముందిరా అక్కడ?" నా కింకా ఆశ్చర్యం తగ్గలేదు.

"అబ్బ.. అబ్బబ్బా!.... యాడ జూసినా పేడకాండ్లేనయ్యా! మిట్టలంతా ఆవుపేడ.. కుప్పలు కుప్పలు పేడ... అబ్బబ్బా! ఎంత మంచిపేడ!..." అటువేసి తన్మయంగా చూస్తూ చెబుతున్నాడు.

అప్పుడు స్పష్టమైంది నాకా దృశ్యం.

నిజమే.

చెట్ల చాటున, రాళ్ళ మాటున, మిట్టల మీద, గరుగులపైన పేడతపకలు గుంపులు గుంపులుగా వున్నాయి.

నల్లటి పేడ... ఇంకా పచ్చి ఆరని పేడ...

అప్పుడనిపించింది "వాడి దృష్టే వే"రని.

పేడను చూస్తున్నపుడు, పొలాన్ని తొక్కుతున్నప్పుడూ, నాగలిని ముట్టుకున్నప్పుడూ గాలి పీల్చుకొన్నంత స్వేచ్ఛగా స్పందిస్తున్నాడు.

"ఇంటికి పోయి గంప దెచ్చుకో..." నవ్వుతూ చెప్పాను. వాడు నవ్వలేదు.

సాయంత్రం తెలిసింది నా సలహా అమలు చేశాడని. తర్వాత క్రమేణా వాడి దారి మారింది. బడికి బదులు పొలం వాడి మనస్సును ఆకట్టుకొంది. వాడి చేతల్ని తన కేసి వొంచుకొంది. ఆకస్మాత్తుగా సీతారామయ్య ఆరోగ్యం పాడయి, పంటను ఇంటికి తెచ్చుకొనేందుక్కూడా చేతగాని పరిస్థితి ఏర్పడినపుడు క్రిష్ణ ముందుకొచ్చాడు. అంచెలంచెలుగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన బడికి ఆ రోజుతో తిలోదకాలిచ్చాడు.

సీతారామయ్య నన్ను పిలిపించుకొని మొరపెట్టుకొన్నాడు. 'కనీసం పరీక్షలైనా రాయ'మని చెప్పమన్నాడు.

రాత్రికి వాణ్ని మిద్దె మీద కూచోబెట్టుకొని నీతులు బోధించబోయాను. చదువు అవసరాన్ని గురించి చెప్పబోయాను.

వెంటనే వాడన్నాడు "సదివిన కాడికి సాలయ్యా నాకు" అని "తెలుగు బాగా వొచ్చు. ఇంగ్లీషు సదవను రాయనొచ్చు. హిందీ కూడా అంతోయింతో సదవవొచ్చు. ఇంగ నాకు సదువెందుకయ్యా! నేను నదువుకుబోతే యీ భూములన్నీ ఎవురుదున్నాల?" అడిగాడు.

కొద్దిసేపు మౌనం తర్వాత తిరిగి తలెత్తాడు.

"నాకు సదువు కన్నా సేద్యెమంటేనే యిష్టమయ్యా!" చెప్పాడు మెల్లిగా.

ఏదో చెప్పాలనుంది వాడికి. చెప్పలేకపోతున్నాడు. మనస్సులో భావాలకు మాటలు అందిరానట్లుంది.

వాడి మౌనం నాకు ఎలుగెత్తి చెబుతోంది. "అయ్యా! మేడి తోక పట్టుకొన్నెప్పటి ఆనందం పేనా పట్టుకొన్నెపుడుండదు. పొలం దున్నేప్పటి సంతోషం అక్షరాలు రాసేప్పుడుండదు. పైరు సూస్తా వున్నెప్పటి కుశాల పాఠాలు సదూతున్నెప్పుడుండదు. పేడను చూసినప్పుడంతా నాకు పేదరాశిపెద్దమ్మ కతలు విన్నెట్టుంటది. ఎద్దు వీపు

దువ్వి దాని మొగంలోకి చూస్తాంటే ఏవేవో గురుబోధలు మోగుతుంటాయి. అయ్యా!... సెప్పగూడదు గానీ... బల్లో కూకుంటే నాకు జైల్లో కూకున్నెట్టుంటది. పొలానికి బోతే రామసిలకల్తో బాటు ఎగురుతాన్నెట్లూ, చేపల్తో బాటు యీదుతా వున్నెట్లూ లేగ దూడల్తో బాటు గెంతుతాన్నెట్లూ వుంటది. నాకెందుకయ్యా సదువు? "అంటూ నిలదీసి అడుగుతున్నట్లుంది.

నా ఆలోచనల్ని భగ్నం చేస్తూ వాడు గొంతెత్తాడు. "మాయమ్మ కమ్మలమ్మి నాకు సైకిల్దిచ్చిండు మా నాయిన. నేను కూలి పన్జేసి మాయమ్మకు కమ్మల్జేయించినా. నా సదువుతో అయితే ఎన్నేండ్లకయినా చేయించి వుందునా?

– మాయమ్మ వొల్లు మీంది మిగిలిన రవ్వంత బంగారాన్ని కూడా కరిగించి వుండేవాన్ని గాదూ?" సూటిగా అడిగాడు నా కళ్ళల్లోకి చూస్తూ.

నేనేం మాట్లాడలేదు.

తర్వాత సీతారామయ్యకు చెప్పాను. "వాన్ని సేద్యానికే వెళ్ళనివ్వ"మని

సంవత్సరం తిరక్కముందే వాడు సేద్యగానిగా నిల్దొక్కుకొన్నాడు. క్రమేణా సేద్యంలో ఎన్నెన్నో మెలకువల్ని తెలిసి కొన్నాడు.

క్రిష్ణ సామర్థ్యాన్ని గురించి ప్రశ్నించానే గాని వాడి మీద నాకు బాగా నమ్మకముంది – నా చేలో బంగారం పండించగలడని, నమ్మకం లేనిదల్లా ప్రకృతి మీదా ప్రభుత్వాల మీదే. కరువులూ, గిట్టుబాటులేని ధరలూ, వ్యవసాయాన్ని పట్టించుకోని ప్రభుత్వ పథకాలూ అన్నీ కలిసి – పచ్చదనం మీద మర్లు పెంచుకొన్న క్రిష్ణను పొలం పొలిమేరలు దాటే దాకా తరిమి తరిమి నగరాల్లో వలస కూలీగా మారుస్తాయేమోనని ఓ వైపు భయంగా వుంది.

నమ్మకాలూ, భయాల మధ్య నలుగుతూనే నాచేను వాడికి అప్పగించాను.

● సాహిత్యనేత్రం త్రైమాసిక – 10వ సంచిక –2005 ●